ప్రజలకు చేరువైన సేవలు

ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు

నాగాయలంక: జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా ప్రజలకు సేవలు మరింత చేరువయ్యాయని అవనిగడ్డ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు అన్నారు. మండలంలోని పర్రచివర, సొర్లగొంది సచివాలయాల పరిధిలో శుక్రవారం జగనన్న సురక్ష క్యాంపులు నిర్వహించారు. పర్రచివరలో 433 సర్టిఫికెట్లు, సొర్లగొందిలో 587 సర్టిఫికెట్లు అందజేశారు. పర్రచివరలో ఎమ్మెల్యే మాట్లాడుతూ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనకు ప్రజల నుంచి మంచి ఆదరణ లభిస్తోందని చెప్పారు. ప్రజాదరణను చూసి ఓర్వలేకనే చంద్రబాబు, పవన్ కల్యాణ్ లాంటివారు ప్రభుత్వంపై దుష్ప్రచారం చేస్తున్నారని విమర్శించారు. నియోజకవర్గంలో నిత్యం ప్రజలతో మమేకమై గ్రామాల్లో తిరుగుతుంటే టీడీపీ ఆరోపణలు చేయడం సిగ్గుచేటన్నారు. మండల ప్రత్యేకాధికారి జి.విజయలక్ష్మి, సర్పంచి మంచాల శ్రావణి, పలువురు అధికారులు, నాయకులు పాల్గొన్నారు.


నాగాయలంక మండలం పర్రచివరలో సర్టిఫికెట్ అందిస్తున్న ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు


బందరులో ధ్రువీకరణ పత్రం అందజేస్తున్న పేర్ని కిట్టు

● **పెడన:** అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందించడమే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పనిచేస్తున్నారని మున్సిపల్ ఇన్‌చార్జి చైర్మన్ ఎండీ ఖాజా అన్నారు. శుక్రవారం పట్టణంలోని 4వ వార్డు సచివాలయం పరిధిలో 11,12,13 వార్డులకు సంబంధించి కాపుల వీధిలోని వినాయకుని గుడి వద్ద జగనన్న సురక్ష శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా 215 మంది లబ్ధిదారులకు వివిధ రకాల ధ్రువీకరణ పత్రాలను అందజేశారు. మున్సిపల్ కౌన్సిలర్లు కటకం ప్రసాదు, లక్ష్మీనరసింహ, కమిషనర్ మహేంద్ర, జేసీఎస్ ఇన్‌చార్జి మతీన్‌ఖాన్, ఆర్‌ఐ మణి కుమార్ పాల్గొన్నారు.

● మండల పరిధిలోని చోడవరం గ్రామంలో శుక్రవారం జరిగిన జగనన్న సురక్ష శిబిరంలో 111 మందికి ధృవీకరణ పత్రాలను ఎంపీపీ, అధికారులు అందజేశారు. ఎంపీపీ రాజులపాటి వాణి, మాజీ ఎంపీపీ ఆర్. అచ్యుతరావు, నాయకులు పాల్గొన్నారు.

పేదలకు ఎన్నో ఉపయోగాలు..

మచిలీపట్నంటౌన్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో పేదలకు ఎన్నో మేలులు జరుగుతున్నాయని వైఎస్సార్ సీపీ యువజన విభాగం జోనల్ ఇన్‌చార్జి పేర్ని కృష్ణమూర్తి (కిట్టు) అన్నారు. జగనన్న సురక్ష కార్యక్రమం 10, 11, 12, 13, 14, 15, 16, 17 డివిజన్లలో శుక్రవారం జరిగింది. పలు డివిజన్లలో జరిగిన కార్యక్రమంలో పేర్ని కిట్టు పాల్గొని లబ్ధిదారులకు ధ్రువీకరణ పత్రాలను ఆయా డివిజన్ కార్పొరేటర్లతో కలిసి అందజేశారు. వైఎస్సార్ సీపీ నగర కన్వీనర్ గూడవల్లి నాగరాజు, కమిషనర్ జి. చంద్రయ్య, ఆయా డివిజన్ల కార్పొరేటర్లు పాల్గొన్నారు.

అవనిగడ్డ: స్థానిక పంచాయతీ పరిధిలోని సచివాలయం 2లో శుక్రవారం జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. రైతు విభాగం జోనల్ ఇన్‌చార్జి కడవకొల్లు నరసింహారావు లబ్ధిదారులకు 1072 సర్టిఫికెట్లను అందజేశారు. ఏఎంసీ చైర్మన్ కొక్కిలిగడ్డ వీర వెంకటేశ్వరరావు, ఎంపీపీ తుంగల సుమతీదేవి, జెడ్పీటీసీ చింతలపూడి లక్ష్మీనారాయణ, సర్పంచ్ గొరుముచ్చు ఉమా నాయకులు పాల్గొన్నారు.

పేదల అభ్యున్నతే లక్ష్యం

ఎమ్మెల్యే సింహాద్రి

ఘంటసాల(అవనిగడ్డ): ప్రతి పేదవాడు పెద్ద చదవులు చదువుకునేలా, ఆర్థిక ఇబ్బందుల వల్ల చదువుకు దూరం కాకూడదనే ఉద్దేశ్యంతో అమ్మ ఒడి వంటి కార్యక్రమాలను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్నారని ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు అన్నారు. ఘంటసాల జెడ్పీ హైస్కూల్‌లో శుక్రవారం జగనన్న అమ్మ ఒడి చెక్కులను ఎమ్మెల్యే సింహాద్రి అందజేసి మాట్లాడారు.

ఘంటసాల మండలంలో అమ్మ ఒడి పథకం ద్వారా రూ. 4.12 కోట్లు నాలుగవ విడత తల్లుల ఖాతాకు జమ అయ్యాయని వివరించారు. ఎంపీపీ వేమూరి రజనీకుమారి, జెడ్పీటీసీ తుమ్మల మురళీకృష్ణ, ఏఎంసీ చైర్మన్ వేమూరి వెంకట్రావ్ తదితరులు పాల్గొన్నారు.

● **మచిలీపట్నం టౌన్:** పశుగ్రాస వారోత్సవాల్లో భాగంగా పశువుల ఆస్పత్రి వద్ద రైతులకు పశు గ్రాస విత్తనాలను పశు సంవర్ధకశాఖ జిల్లా అధికారి ఎస్‌ఎస్‌పి దివాకర్ శుక్రవారం పంపిణీ చేశారు. పశుసంవర్ధక శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

నేడు వైఎస్సార్ జయంతి

మచిలీపట్నంటౌన్: మహానేత దివంగత వైఎస్ రాజశేఖరరెడ్డి జయంతి కార్యక్రమం శనివారం నగరంలోని పలు ప్రాంతాల్లో నిర్వహిస్తామని నగర మేయర్ మోకా వెంకటేశ్వరమ్మ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 గంటలకు రామానాయుడుపేటలోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో వైఎస్సార్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించి అక్కడి నుంచి నగరంలోని వివిధ ప్రాంతాల్లో ఉన్న వైఎస్సార్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పిస్తామని చెప్పారు.

అమ్మవార్లకు ఆషాఢ సారె

గణపేశ్వరం(నాగాయలంక): మండలంలోని దుర్గా, గణపేశ్వరస్వామి వారి ఆలయంలో శుక్రవారం ఆషాఢ సారె మహోత్సవం వైభవంగా జరిగింది. దుర్గాదేవి అమ్మవారిని, గణపేశ్వర స్వామి వారి ఆలయంలో శివలింగాన్ని, ఆలయ ఆవరణలను కూరగాయలతో అలంకరించారు. భక్తులు అమ్మవారికి ఆషాఢ సారె సమర్పించారు.

మచిలీపట్నంటౌన్: ఆజాద్‌రోడ్డులోని కన్యకా పరమేశ్వరి ఆలయంలో కన్యకాపరమేశ్వరి, పార్వతిదేవి అమ్మవార్లకు భక్తులు శుక్రవారం ఆషాఢసారె సమర్పించారు. అమ్మవార్లు శాకంబరీ అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ అధ్యక్ష, కార్యదర్శులు మామిడి మురళీకృష్ణ, ఎంవీ బాబాప్రసాద్, సభ్యులు పర్యవేక్షించారు.

నేడు పశువ్యాధి నిర్ధారణ ప్రయోగశాల ప్రారంభం

అవనిగడ్డ: అవనిగడ్డలో ఏర్పాటు చేసిన పశువ్యాధి నిర్ధారణ ప్రయోగశాలను ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు శనివారం ప్రారంభించనున్నారు. రూ.80 లక్షల వ్యయంతో పలు ఆధునిక పరికరాలను అందుబాటులోకి తీసుకువచ్చారు. దీంతో దివిసీమలోని మూగజీవాలకు సత్వర వైద్య సేవలు అందుబాటులోకి రానున్నాయి.

13న పెడన పురపాలక సంఘం చైర్మన్ ఎన్నిక

పెడన: పెడన పురపాలక సంఘం చైర్మన్ ఎన్నిక ఈ నెల 13న నిర్వహిస్తారు. ఈ మేరకు ఎన్నికల సంఘం జారీ చేసిన ఉత్తర్వులు శుక్రవారం మున్సిపల్ కార్యాలయానికి అందాయి. మున్సిపల్ చైర్మన్ బళ్ల జ్యోత్స్నరాణి గత నెల 17న తన పదవికి రాజీనామా చేసిన విషయం విదితమే. ఈ నేపథ్యంలో ఖాళీగా ఉన్న చైర్మన్ పదవికి 13న ఎన్నిక నిర్వహించాలని ఎన్నికల సంఘం నుంచి ఆదేశాలు వచ్చాయి. ఈ నెల 9వ తేదీ లోగా సభ్యులందరికి తెలియచేసి 13న చైర్మన్ ఎన్నిక నిర్వహించాలని ఆ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఇదిలా ఉంటే పురపాలక సంఘంలోని 23 వార్డులకు సంబంధించి 21 వార్డులలో వైఎస్సార్ సీపీ కౌన్సిలర్లు ఉన్నారు. 11వ వార్డు కౌన్సిలర్ మృతి చెందడంతో వైఎస్సార్ సీపీ బలం 20గా ఉంది. దీంతో మున్సిపల్ చైర్‌పర్సన్ వైఎస్సార్ సీపీ అభ్యర్థి ఎన్నిక లాంఛనమే. ముందుగా చేసుకున్న ఒప్పందం ప్రకారం రాష్ట్ర గృహ నిర్మాణ శాఖా మంత్రి జోగి రమేష్ 7వ వార్డు కౌన్సిలర్ అయిన కటకం నాగకుమారి పేరును చైర్‌పర్సన్‌గా ప్రతిపాదించారు.

ఆటో బోల్తాపడి ఉపాధ్యాయులకు గాయాలు

బంటుమిల్లి: నారాయణపురం గ్రామం వద్ద 216 జాతీయ రహదారిపై శుక్రవారం ఆటో బోల్తాపడి ఐదుగురు ఉపాధ్యాయులు, ఒక విశ్రాంత ఉపాధ్యాయుడు గాయపడ్డారు. కృత్తివెన్ను మండలం సంగమూడి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పనిచేస్తున్న ఐదుగురు ఉపాధ్యాయులు విధులు ముగించుకుని ఆటోలో మచిలీపట్నానికి బయలుదేరారు. ఆటో నారాయణపురం గ్రామం వద్దకు రాగానే కుక్క అడ్డు వచ్చింది. దానిని తప్పించే క్రమంలో ఆటో అదుపుతప్పి జాతీయ రహదారిపై బోల్తా కొట్టింది. ఈ ప్రమాదంలో ఆటోలో ఉన్న హెచ్‌ఎంతో సహా మిగిలిన ఉపాధ్యాయులు గాయపడ్డారు. వీరిలో విశ్రాంత ఉపాధ్యాయుడు టి. కృష్ణవరప్రసాదు తీవ్రంగా గాయపడి అపస్మారక స్థితికి వెళ్లారు. ఇటీవల జరిగిన బదిలీల్లో భాగంగా తన భార్య సంగమూడి ఉన్నత పాఠశాలలో సైన్స్ టీచర్‌గా జాయిన్ కావడానికి వస్తే ఆయన ఆమెకు తోడు వచ్చి వీరితోపాటు తీవ్రంగా గాయపడ్డాడు. బాధితులను బంటుమిల్లి, కృత్తివెన్ను 108 వాహనాల్లో చికిత్స నిమిత్తం బందరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

ముగిసిన సామాజిక తనిఖీ గ్రామ సభలు

బంటుమిల్లి: కంచడం, మల్లేశ్వరం, పెదతుమ్మిడి, ఆముదాలపల్లి, చినతుమ్మిడి, నాగన్నచెరువు, పెందుర్రు, మల్లపరాజుగూడెం, సాతులూరు, చోరంపూడి గ్రామాల్లో మూడు రోజులుగా జరుగుతున్న సామాజిక తనిఖీ (సోషల్ ఆడిట్) ముగిసింది. శుక్రవారం ఆయా గ్రామాల్లోని సచివాలయాల వద్ద సర్పంచ్‌ల అధ్యక్షతన గ్రామ సభలు నిర్వహించారు. జిల్లా రిసోర్సు పర్సన్ (డీఆర్‌పీ)లు తనిఖీ నివేదికలు వివరించారు. పలు గ్రామాల్లో కూలీలకు జాబ్ కార్డులు అందజేశారు.

ఉర్దూ పాఠశాలల సందర్శన

పెడన: పట్టణంలోని 4, 5 వార్డులలో బాలురు, బాలికల ఉర్దూ పాఠశాలలను రాష్ట్ర ఉర్దూ బోధన శాస్త్ర సహాయకులు షేక్ అబ్దుల్‌ఘనీ శుక్రవారం సందర్శించారు. పాఠశాలలో అటెండెన్స్, రికార్డులను పరిశీలించారు. అనంతరం ఆయా పాఠశాలల ఉపాధ్యాయులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రతి పాఠశాలలో విద్యార్థుల సంఖ్యను గణనీయంగా పెంచాలన్నారు. ఉర్దూ డెప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ స్కూల్స్ ఎండీ సాదాతుల్లా, కృష్ణాజిల్లా సమగ్ర శిక్ష ఉర్దూ అసిస్టెంట్ అకడమిక్ మానిటరింగ్ అధికారి జి. సీతామహాలక్ష్మి, ఎంఈఓ-2 వైవీ హరనాథ్, ఉపాధ్యాయులు, సీఆర్‌పీలు పాల్గొన్నారు.

108లో ఉద్యోగావకాశాలు

మచిలీపట్నంటౌన్: 108 సర్వీసెస్‌లో ఎమర్జెన్సీ టెక్నీషియన్ పోస్టుల భర్తీకి ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నామని 108 జిల్లా మేనేజర్ హరీష్‌రెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. నగరంలోని నోబుల్ కళాశాల సెంట్రల్ హాల్‌లో ఆదివారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు ఇంటర్వ్యూలు జరుగుతాయన్నారు. ఇతర వివరాలకు సెల్: 70931 23579, 89191 97050 నంబర్లను సంప్రదించాలని కోరారు.

13న డెప్యూటీ మేయర్ల ఎన్నిక

మచిలీపట్నంటౌన్: మచిలీపట్నం నగర పాలక సంస్థ నూతన డెప్యూటీ మేయర్ల ఎన్నిక కార్యక్రమం ఈ నెల 13వ తేదీన నిర్వహించేందుకు ప్రభుత్వం శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు నగర పాలక సంస్థ పరిధిలో ఇద్దరు డెప్యూటీ మేయర్ల నియామకానికి 13న ఎన్నిక నిర్వహించి ఎన్నికైన వారితో ప్రమాణ స్వీకారం చేయించనున్నారు. ఇప్పటి వరకు డెప్యూటీ మేయర్లుగా పనిచేసిన లంకా సూరిబాబు, తంటిపూడి కవిత ఇటీవల వారి పదవులకు రాజీనామా చేశారు. దీంతో నూతన డెప్యూటీ మేయర్ల ఎన్నికకు ప్రభుత్వం నుంచి కమిషనర్‌కు ఉత్తర్వులు అందాయి.

శాకంబరీగా అన్నపూర్ణాదేవి

భావదేవరపల్లి(నాగాయలంక): ఆషాఢ మాసం సందర్భంగా గ్రామంలోని అన్నపూర్ణాదేవి సమేత కాశీవిశ్వేశ్వరస్వామి ఆలయంలో శుక్రవారం శాకంబరి మహోత్సవం ఘనంగా జరిగింది. అమ్మవారిని కూరగాయలు, ఆకుకూరలు, పండ్లతో అలంకరించి పూజలు చేశారు. ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త పూషడపు నిరంజనరావు పర్యవేక్షించారు.

స్టడీ మెటీరియల్ బహూకరణ

బంటుమిల్లి: పెదతుమ్మిడి ఉన్నత పాఠశాలలో ప్రభుత్వం ఏర్పాటు చేసిన ప్లస్-2 విద్యార్థులకు తెలుగు ఉపాధ్యాయిని ఓలేటి ఉమా సరస్వతి స్టడీ మెటీరియల్‌ను బహూకరించారు. శుక్రవారం పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో విద్యార్థులకు మెటీరియల్, నగదు పురస్కారాలను అందజేశారు. ఇటీవల జరిగిన బదిలీల్లో భాగంగా ఉమాసరస్వతి పురిటిగడ్డ ఉన్నత పాఠశాలకు బదిలీ అయ్యారు. గత ఏడాది ఇంటర్ మొదటి సంవత్సరం ఫలితాల్లో అత్యధిక మార్కులు సాధించిన బి. తేజస్వీ, మీగడ మౌనిక, టి. వాణీలకు ఒక్కొక్కరికి రూ. 2 వేల చొప్పున నగదు పురస్కారం అందచేశారు.

వ్యాన్ ఢీకొని వ్యక్తికి తీవ్ర గాయాలు

మోపిదేవి: రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. ఎస్‌ఐ పద్మ తెలిపిన వివరాల ప్రకారం.. మోపిదేవి గొల్లపాలెంకు చెందిన బట్టు మల్లికార్జునరావు శుక్రవారం ఉదయం తన ఎడ్లబండిపై పొలం పనులకు బయలుదేరాడు. మోపిదేవివార్పు వద్దకు రాగానే వెనక నుంచి వచ్చిన పేపర్ వ్యాను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఎడ్ల బండి రోడ్డు పక్కనున్న డ్రెయిన్‌లోకి బోల్తా కొట్టింది. మల్లికార్జునరావుకు తీవ్ర గాయాలు కావడంతో 108 వాహనంలో మచిలీపట్నం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అక్కడ వైద్యుల సూచనల మేరకు విజయవాడకు తరలించారు. ఎద్దుకు కూడా గాయాలయ్యాయి. కేసు నమోదు చేశారు.

మాజీ ఎంపీపీ బోడావుల మృతి



బంటుమిల్లి: బంటుమిల్లి మాజీ ఎంపీపీ బోడావుల సత్యనారాయణమూర్తి (71) హైదరాబాద్‌లోని ఆస్పత్రిలో చికిత్స పొందుతూ శుక్రవారం తెల్లవారు ఝామున మృతిచెందారు. మండల వ్యవస్థ ఏర్పడిన అనంతరం జరిగిన ఎంపీపీ ఎన్నికల్లో ఆయన కాంగ్రెస్ పార్టీ తరఫున 1987లో తొలి ఎంపీపీగా ఎంపికయ్యారు. ప్రస్తుతం ఆయన టీడీపీ నాయకుడిగా కొనసాగుతున్నారు. ఆయన మృతితో స్వగ్రామం కొర్లపాడులో విషాదం నెలకొంది. ఆయన కుమారుడు, కుమార్తె ఇతర దేశాల్లో ఉన్నందున అంత్యక్రియలు స్వగ్రామంలో ఆదివారం నిర్వహిస్తామని కుటుంబ సభ్యులు తెలిపారు. మృతదేహం శనివారం స్వగ్రామానికి వస్తుందని చెప్పారు.

రక్తహీనత నివారణకు చర్యలు

చిలకలపూడి(మచిలీపట్నం): వైఎస్సార్ హెల్త్ వెల్‌నెస్ సెంటర్ల సిబ్బంది రక్తహీనత నివారణకు చర్యలు తీసుకోవాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ జి. గీతాబాయి అన్నారు. ఆమె కార్యాలయంలో సిబ్బందికి శుక్రవారం శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. డీఎంహెచ్‌ఓ మాట్లాడుతూ సిబ్బందికి పలు సూచనలు చేశారు. డాక్టర్ సుదర్శన్, డీపీఎంఓ బి. శివసాంబిరెడ్డి, రాజేంద్రకుమార్, తారక రామారావు పాల్గొన్నారు.

90 మందికి వైద్య పరీక్షలు

బంటుమిల్లి: నాగేశ్వరరావుపేట గ్రామంలోని సబ్ సెంటర్ వద్ద శుక్రవారం ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమం నిర్వహించారు. వైద్యాధికారి సౌందర్య పర్యవేక్షణలో 90 మంది రోగులకు, గర్భిణులకు వైద్య పరీక్షలు చేసి మందులు అందజేశారు. వైద్య సిబ్బంది అరుంధతి, మల్లేశ్వరరావు, ఏఎన్‌ఎం నరసమ్మ, ఆశా వర్కర్లు, డీఈఓ విజయ్ పాల్గొన్నారు.

పింఛనుదారుల వితరణ

మచిలీపట్నంటౌన్: 36వ డివిజన్‌కు చెందిన పింఛనుదారుడు మద్దంశెట్టి నాగమల్లేశ్వరరావు ఇటీవల మృతిచెందాడు. డివిజన్‌లోని తోటి పింఛనుదారులు సేకరించిన రూ. 32,500లను మృతుడి భార్య లక్ష్మీకి శుక్రవారం అందజేశారు. కార్పొరేటర్ రాంప్రసాద్, చెన్నకేశవరావు, పింఛనుదారులు పాల్గొన్నారు.

మృతుడి కుటుంబానికి సాయం

కోడూరు: కోడూరు ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘ సభ్యుడు కోట వెంకటసుబ్బారావు ఇటీవల మృతిచెందాడు. సంఘ చైర్మన్, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ పరిశె మాధవరావు చేతుల మీదుగా మృతుడి భార్య శివకుమారికి రూ.10 వేల నగదును శుక్రవారం అందజేశారు. సీఈఓ అర్జా వెంకట నగరాయులు, వెన్నా ప్రసాద్, నాయకులు పాల్గొన్నారు.

ఘనంగా ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక దినోత్సవం

మచిలీపట్నంటౌన్: మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి (ఎమ్మార్పీఎస్) వ్యవస్థాపక దినోత్సవం శుక్రవారం గుప్తా సెంటర్‌లో జగ్జీవన్‌రామ్ విగ్రహం వద్ద ఘనంగా నిర్వహించారు. నేత్ర వైద్యుడు జి. భానుమూర్తి ఎమ్మార్పీఎస్ జెండాను ఆవిష్కరించారు. ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ పుట్టినరోజు కార్యక్రమాన్ని నిర్వహించారు. వైఎస్సార్ సీపీ నగర నాయకుడు బందెల థామస్ నోబుల్ కేక్ కట్ చేశారు. ఎమ్మార్పీఎస్ నాయకులు పాల్గొన్నారు.